# నలభై నిమిషాల కథ

కేట్ చాపిన్, 1894

అనువాదం—చంద్ర

శ్రీమతి మల్లార్డ్ కి గుండె జబ్బు వుందని తెలుసు కనక ఆమెకి భర్త మరణ వార్తని చాలా జాగ్రత్తగా చెప్పారు.

ఆమె అక్క జోసెఫిన్ నెమ్మదిగా సగం చెప్పీ చెప్పకుండా నిజాన్ని బయట పెట్టింది. ఆమె భర్త స్నేహితుడు రిచర్డ్స్ అక్కడే ఉన్నాడు. రైలు ప్రమాదంలో మరణించిన వారి వివరాలను దిన పత్రిక ఆఫీసులో చూసి బ్రెంట్‌లీ మల్లార్డ్ పేరు మరోసారి నిర్ధారించుకోగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్నేహితుడి యింటికి బయలు దేరాడు. ఎవరైనా కొత్త వ్యక్తి ఆ వార్తని మొరటుగా శ్రీమతి మల్లార్డ్‌కి చెప్తారేమోనని అతని భయం.

చాలామంది ఆడవాళ్ళ లాగ ఆమె విషయం విన్న వెంటనే శూన్యంలోకి చూస్తూ మొద్దుబారి పోయినట్లు అయిపో లేదు. ఒక్కసారిగా అక్క భుజాల మీద పడిపోయి గుక్క తిప్పుకోకుండా ఏడ్చేసింది. ఆ ఉధృతం తగ్గగానే తన గదిలోకి పోయి తలుపేసుకొంది. ఎవరినీ లోనికి రానివ్వ లేదు.

కిటికీ ముందున్న పడక్కుర్చీలో నిస్సత్తువగా వాలిపోయింది.

కిటికీ లోంచి తన యింటి ముందున్న చెట్ల వసంతాగమనపు పచ్చదనం ఆమెకి కనిపిస్తుంది. వర్షపు వాసన తగుల్తోంది. వీధిలో ఏదో అమ్ముకొనే వాడు అరుస్తూ పోతున్నాడు. ఎవరో దూరంగా పాడుతున్న పాట కొద్ది కొద్దిగా వినవస్తూంది. పక్షుల కిలకిలలు గాలిలో ఎగురుతున్నాయి.

దట్టంగా అలుముకున్న మబ్బుల మధ్య లోంచి నీలాకాశం అక్కడక్కడా తొంగి చూస్తున్నది. వెక్కిళ్ళతో ఆమె శరీరం కంపిస్తున్నది

ఆమె మొహంలో యవ్వనం, ప్రశాంత గాంభీర్యం వున్నాయి. ముఖ కవళికలు ఆమెలోని అణకువని మాత్రమే కాదు మానసిక స్థైర్యాన్ని కూడ సూచిస్తున్నాయి. యిప్పుడామె ఆ నీలాకాశపు తునక నొకదాన్ని దీర్ఘంగా చూస్తున్నది. ఆలోచన లేమీ లేని స్తబ్ధతలో వున్నదామె.

తనకేమో అయిపోతున్నట్లు ఆమె కనిపించింది. భయమేసింది కూడ. ఏమిటది ? ఆమెకేమీ తెలియటం లేదు. అంతర్లీనంగా భ్రాంతిగా ఏదో జరిగిపో తోంది. ఆ అనుభూతేదో భాహ్యాంత రాల్నించి ధ్వనుల్ని ఛేదించుకొని వాసనలు రంగుల్లో మిళితమై తనను తాకుతోంది.

ఆమె గుండెలు పైకీ కిందకీ ఎగిరి పడ్తున్నాయి. తనని ఆవహిస్తున్నదేదో కొంచెం కొంచెమే అర్థమవుతున్నట్లున్నది. తెలిసినట్లుండగానే, ఆ ఆవాహనని తిప్పి



కొట్టటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నది. బలహీనమైన ఆమె చేతులలానే ఆమె మనసు కూడ దుర్బలంగా వుంది.

తన ప్రయాస వృధా అని తేలగానే ఆమె పెదాల నుంచి చిన్న శబ్దం అనుకో కుండా వచ్చింది. పదే పదే ఆ పదం మస్తిష్కంలో గంతులేస్తున్నది. "స్వేచ్ఛ, స్వేచ్ఛ స్వేచ్ఛ !" శూన్యంలోకి చూడటం మానేసింది. ముఖంలోని భయం పోయింది. కళ్ళు చురుగ్గా మెరుస్తున్నాయి.

నాడి వేగంగా కొట్టుకుంటోంది. ఉరకలేసే రక్తం ఆమె శరీరంలోని అణువణువునీ ఆహ్లాద పరుస్తోంది.

తననావహిస్తున్న ఉద్వేగం ఘోరమైన ఆనందమనే అనుమానం రాగానే ఆ విషయాన్ని ఆమె కొట్టి పారేసింది. అదేదో తాత్కాలిక భ్రమ అనుకొంది.

తననెప్పుడూ ప్రేమగా చూసే భర్త కళ్ళనీ, సున్నితమైన చేతుల్నీ నిర్జీవంగా చూడగానే తనకు ఏడుపు ముంచుకు రాగలదని ఆమెకి తెలుసు. కాని, ఆ విషాదక్షణాని కావల విశాలంగా పరుచు కొన్న తనకు మాత్రమే చెందే భవిష్యత్తు ఆమెని చేతులు చాచి పిలుస్తోంది. ఆ కౌగిలిలో ఒదిగి పోకుండా ఉండలేక పోతుంది తను.

ఆ రాబోయే కాలంలో తను ఎవరి కోసమూ బతకక్కర లేదు. తను తన కోసమే జీవిస్తుంది. స్త్రీ పురుషు లెందరో తమ తోటివారిని గుడ్డిగా మలచటానికి ఉపయోగించే శక్తి మంతమైన బంధమేదీ తన మానసిక స్వేచ్ఛకి అడ్డుకట్ట వేయలేదు. యీ క్షణిక సత్యావిష్కరణని తనలోని లాలిత్యమో క్రూరత్వమో ప్రేరేపిస్తున్నట్లు న్నది. యిదంతా నిస్సహాయ నేరం లాగుంది.

కొన్ని సార్లు ప్రేమ కలగక పోయినా మొత్తమ్మీద ఆమె అతన్ని ప్రేమించిన మాట నిజమే. అయితేనేం ! అకస్మాత్తుగా ఎదురయిన యీ స్వాతంత్ర్యం ఆమె అస్తిత్వాన్ని ఆసాంతం కుదిపేస్తోంది. యీ ఉత్తేజం ముందు ఎవరికీ కొరుకుడుపడని ప్రేమా, అనుబంధం శుద్ధ నిరర్ధకమని పిస్తోంది.

"స్వేచ్ఛ ! శరీరానికి, మనసుకి బంధాలు ఎగిరిపోయాయి !" అని తనలో తనే పదే పదే అనుకొంటుందామె.

మూసిన తలుపులోంచి జోసెఫిన్ చెల్లెల్ని పిలుస్తున్నది. "లూసీ, తలుపు తెరువమ్మా! లోపల వొక్కదానివే ఏం చేస్తున్నావు ? దయచేసి తలుపు తీయి. మే మందరం ఉన్నాం కదా"

"నువ్వు అవతలికి వెళ్ళు. నేను బాగానే ఉన్నాను." తెరిచివున్న కిటికీ లోంచి హృదయ స్వేచ్ఛ నాస్వాదిస్తోందామె.

రాబోయే కాలాన్నీ స్వేచ్ఛనీ తల్చుకొని పొంగి పోతున్నది. వసంతం, వేసవి అన్ని

కాలాలు తనవే. తనిష్టం. దేవుడి దయ వల్ల తానెక్కువ కాలం బతకాలని కోరుకుంటున్నదామె. నిన్ననే బతుకంతా నిరాశగా నిష్ప్రయోజనంగా అనిపించింది.

అక్క గొడవ పడలేక చివరికి తలుపు తీసింది. ఆమె కళ్ళు విజయోత్సాహంతో మెరుస్తున్నాయి. తనకు తెలియకుండానే గర్వంగా ఠీవీగా నడుస్తున్నది. అక్క నడుం పట్టుకొని బయటకు వచ్చింది. రిచర్డ్స్ వాళ్ళకేసి ఆతృతగా చూస్తున్నాడు.

ఎవరో వీధి తలుపు కొడుతున్నారు. రిచర్డ్స్ తలుపు తీయగానే చేతిలో సూట్‌కేస్‌తో బ్రెంట్‌లీ మల్లార్డ్ ప్రత్యక్షమయ్యాడు. కారణాంతరాల వల్ల అతను రైలెక్కలేదట. రిజర్వేషన్ వృధా అయిందట. ప్రమాదం జరిగినట్లు కూడ తనకి తెలియదని చెప్పాడు.




జోసెఫిన్ సంతోషం గానో సంభ్రమం గానో పెద్దగా అరిచింది. రిచర్డ్స్ త్వరత్వరగా లూసీకి అడ్డుగా నిల్చుని ఆమె భర్తని చూడకుండా చేయాలని ప్రయత్నిస్తున్నాడు.

కాని అప్పటికే ఆలస్యమయింది.

డాక్టరు వచ్చి శ్రీమతి మల్లార్డ్ సంతోషాతిరేకంతో మరణించిందని శాస్త్రీయంగా నిర్ధారించాడు. ●










